క్లుప్తంగా

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ

కొడవలూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వి.ప్రద్యుమ్నకుమార్ కొడవలూరులోని ఆయన కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశం జిల్లా పర్చూరు ఎంపీడీఓగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న పి.సుబ్రహ్మణ్యం టంగుటూరు ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్‌ను ఈఓపీఆర్డీ వి.డేవిడ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండల స్థాయి అధికారుల బదిలీలు జరుగుతుండడం తెల్సిందే.

• **కోవూరు:** కోవూరు ఎంపీడీఓగా బి.రామాంజనేయులు గురువారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ను ఈఓపీఆర్డీ నాగూర్‌వలి, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ ముజీబ్ పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈయన బాపట్ల జిల్లా జె.పంగులూరు నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న శ్రీహరి ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. కార్యక్రమంలో టైపిస్ట్ హుమాయున్, సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చిలో కౌన్సిల్ సమావేశం

• పలు అంశాలకు ఆమోదం



మాట్లాడుతున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరు అంశాలను ప్రవేశపెట్టగా సభ్యులందరూ వాటికి ఆమోదం తెలిపారు. ఎస్కే దస్తగిరిని కోఆప్షన్ మెంబర్‌గా ఎన్నుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే 92 శాతం పూర్తి

మనుబోలు : మండల పరిధిలో కులగణన సర్వే 92 శాతం పూర్తయిందని ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. మండలంలోని వెంకన్నపాళెంలో జరుగుతున్న కులగణన సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేను పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శీనయ్య ఉన్నారు.

వసతిగృహ విద్యార్థినులకు వైద్య పరీక్షలు



పొదలకూరు : పట్టణంలోని సచివాలయం బిట్–3 పరిధిలో గురువారం బీసీ హాస్టల్ విద్యార్థినులకు డాక్టర్ రిషిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వసతిగృహ పరిసరాలను పరిశీలించారు. సంక్షేమాధికారి ద్వారా వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిందిగా సూచించారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందజేయాలని, కాచి చల్లార్చిన నీటిని తాగించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున విద్యార్థులకు జ్వరాలు వస్తే వెంటనే సమాచారం అందజేయాల్సిందిగా సూచించారు. డాక్టర్ వెంట ఆరోగ్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించండి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించాలని బుచ్చిరెడ్డిపాళెం సీఐ హైమారావు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై వాహనదారులకు ట్రాఫిక్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతోందని, వాహనదారుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రయాణం సజావుగా సాగుతుందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం

• ఆర్డీఓ మలోల



రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న మలోల

నెల్లూరు రూరల్: డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని ఆర్డీఓ మలోల పేర్కొన్నారు. ఆమంచర్లలోని సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని చెప్పారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో లబ్ధి పొందిన మహిళలు ఈ అవకాశం ద్వారా హక్కులను పొందుతారని చెప్పారు. రిజిస్ట్రేషన్ల విషయమై డివిజన్ పరిధిలోని మండలాల తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామన్నారు. నెల్లూరు రూరల్ తహసీల్దార్ సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన నేతలు



నెల్లూరు(మినిబైపాస్): కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలో బీజేపీ నేతలు సురేంద్రరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. మెడికవర్ హాస్పిటల్ సమీపంలో అండర్ పాస్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. నెల్లూరు బైపాస్ రోడ్డును ఆరు వరుసలుగా మార్చేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

లాఫింగ్ క్లబ్ ప్రారంభం అభినందనీయం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలో వాకర్స్ లాఫింగ్ క్లబ్‌ను తొలిసారిగా ప్రారంభించడం.. హాస్య యోగా సాధన తరగతులను నెల పాటు ఉచితంగా నిర్వహించడం సంతోషకరమని వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. వీఆర్సీ గ్రౌండ్స్‌లో లాఫింగ్ క్లబ్‌ను వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లాఫింగ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, రియాజ్ అహ్మద్ మాట్లాడారు. హాస్య యోగా మాస్టర్ వెంకురెడ్డి ఆధ్వర్యంలో నెల పాటు ఉదయం ఏడు గంటలకు శిబిరాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. అనంతరం వెంకురెడ్డిని సత్కరించారు. డాక్టర్లు భాస్కర్‌రావు, పెంచలయ్య, క్లబ్ గౌరవాధ్యక్షులు సన్నే సాహెబ్, ఎమ్వీ రెడ్డి ప్రసాద్, లక్ష్మణ్‌కుమార్‌రెడ్డి, సుభాషిణి, శివయ్య, వెంకటేశ్వరరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు సిటీ: నగరంలోని 14వ డివిజన్లో స్పర్శ లెప్రసీపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టు, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని 15 రోజుల పాటు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ సమీరా, ఏపీఎంఓ రమణారెడ్డి, సీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు రూరల్: కల్లూరుపల్లి ఇందిరమ్మ కాలనీలోని లూథరన్ చర్చిలో పేదలకు నిత్యావసర సరుకులను గుంటూరులోని లూథరన్ బిషప్ విజయకుమార్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రెండు వేల మందికి నిత్యావసర సరుకులను అందజేశామని చెప్పారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్, ఏపీయూడబ్ల్యూజే నేత జయప్రకాష్, హనోక్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ స్థానిక సలహా మండలి సమావేశం



సలహా మండలి సభ్యులతో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఢిల్లీలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఢిల్లీ స్థానిక సలహామండలి సమావేశాన్ని టీటీడీ ఢిల్లీ స్థానిక సలహా మండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తిరుమలలో శనివారం నుంచి సోమవారం వరకు నిర్వహించనున్న వెంకటేశ్వర ధార్మిక సదస్సు విజయవంతంపై చర్చించారు. ఉత్తరాది రాష్ట్రాల్లోని టీటీడీ ఆలయాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సమీక్షించారు.

మెగా వైద్య శిబిరం



సూచనలు చేస్తున్న వైద్యులు

నెల్లూరు (టౌన్): కార్మికులకు మెగా వైద్య శిబిరాన్ని ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్య కళాశాలలో ఈఎస్ఐ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులకు బీపీ, షుగర్, ఈసీజీ, థైరాయిడ్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈఎస్ఐ వైద్యులు లీలాకుమారి, విజయకుమారి, కిషోర్‌కుమార్, కార్యాలయ మేనేజర్ సుధీర్ కుమార్, కళాశాల డీన్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



నెల్లూరు (వేదాయపాళెం): పదవీ విరమణ పొందిన నగరంలోని యూనియన్ బ్యాంక్ ఉద్యోగి బ్రహ్మయ్యను సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య సత్కరించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఏనుగు సుందరరామిరెడ్డి రోటరీ క్లబ్ ఫంక్షన్ హాల్లో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వెంకటేశ్వర్లు, మల్లికార్జున, లక్ష్మణ్‌కుమార్‌రెడ్డి, జయరామరాజు, బాబురెడ్డి, అంజనేయులు, వెంకటేశ్వర్లు, మురళి, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



21వ డివిజన్లో..

నెల్లూరు(బారకాసు): రూరల్ పరిధిలోని 21 డివిజన్లో గల బీవీనగర్ తదితర ప్రాంతాల్లో పింఛన్లను కార్పొరేటర్ మొయిళ్ల గౌరి ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు వెంగళ్‌రెడ్డి, పెంచలనర్సారెడ్డి, రాజారెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, సాయి, మాల్యాద్రి, సుబ్బారావు, కృష్ణారెడ్డి, బుజ్జన్న, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

గంధ మహోత్సవం రేపు

నెల్లూరు రూరల్: కొత్తూరు గ్రామికనగర్‌లోని ఖాజాగరీబ్ నవాజ్ దర్గా వద్ద గంధ మహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నామని కమిటీ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

'కాంట్రాక్ట్ వ్యవస్థను తీసుకొచ్చింది చంద్రబాబే'

నెల్లూరు(దర్గామిట్ట): ప్రభుత్వ విభాగాలను బలహీనం చేస్తూ కాంట్రాక్ట్ వ్యవస్థను తీసుకొచ్చింది చంద్రబాబేనని, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ టీచర్లను బానిసలుగా తయారు చేస్తూ అప్రెంటిస్ వ్యవస్థనూ ఆయనే ప్రవేశపెట్టారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పాత పింఛన్ విధానాన్ని రద్దు చేసి సీపీఎస్‌ను అమల్లోకి తీసుకొచ్చింది చంద్రబాబని విమర్శించారు. ప్రభుత్వోద్యోగులపై ప్రస్తుతం కపట ప్రేమ చూపుతూ మొసలికన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు.

టేకు విక్రయానికి ఈ - టెండర్లు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో టేకు, ఇతర చెట్ల విక్రయానికి ఈ – టెండర్లను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సంభవించిన తుఫాన్‌తో చెట్లు నేలకొరిగాయన్నారు. వీటి అంచనా విలువ రూ.1.25 లక్షల ఉంటుందని, టెండర్లను ఈ నెల 17 వరకు స్వీకరించనున్నామని చెప్పారు. వివరాలకు 99481 21701, 94400 90838 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వేతనాలు పెంచాలని వినతి

నెల్లూరు(పొగతోట): జాతీయ ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలను పెంచాలని అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు విజయవాడలో రాష్ట్ర అధికారులకు వినతిపత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పౌష్టికాహారం అందజేత

నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ హోప్ చర్చిలో 155 మందికి పౌష్టికాహారాన్ని అబైడింగ్ హోప్ ట్రస్ట్ చైర్మన్ బ్రదర్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా స్పెషల్ కలెక్టర్ చిన్న ఓబులేసు హాజరయ్యారు. ఎయిడ్స్ కంట్రోల్ డైరెక్టర్ కిరణ్, అడిషనల్ డైరెక్టర్ శివ, కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్, జయప్రకాష్, సిస్టర్ నిరీషా, ఫాదర్ డేవిడ్ లివింగ్‌స్టన్ తదితరులు పాల్గొన్నారు.

బేస్‌లైన్ స్టడీపై దృష్టి పెట్టాలి



కోవూరు : ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బేస్‌లైన్ స్టడీపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, దీనిపై ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఎంఈఓ–2 వై.చెంచులక్ష్మమ్మ అన్నారు. మండల కేంద్రంలోని 10వ వార్డులో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదవడం, రాయడంలో వెనుకబడి ఉన్నారని, వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలన్నారు. ఆమె వెంట సీఆర్పీ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

సీహెచ్‌సీకి ఇన్వర్టర్ల వితరణ

కోవూరు: కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ నిర్వాహకులు సుమారు రూ.50 వేలు విలువ చేసే ఇన్వర్టర్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు సలావుద్దీన్, వంశీకృష్ణ వారి సేవలను కొనియాడారు. అనంతరం ఆ సంస్థ చైర్మన్లు గాదిరాజు జీవనకృష్ణ, హరికృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే తామ సంస్థ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, దీనిని కొనసాగిస్తామని వెల్లడించారు.

ఆస్పత్రికి స్పెషల్ బెడ్లు

సీహెచ్‌సీలోని ఐసీయూకు సంబంధించి స్పెషల్ బెడ్లు గురువారం ఆస్పత్రికి చేరుకున్నాయి. ఇప్పటికే ఈ ఆరోగ్య కేంద్రంలో రోగులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది.

ఏఈఆర్వోలకు సత్కారం



సత్కార గ్రహీతలతో వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగర నియోజకవర్గ ఏఈఆర్వోలుగా విధులు నిర్వర్తించి ఎన్నికల నిబంధనల మేరకు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్తున్న అర్బన్ తహసీల్దార్ నిర్మలానందబాబా, కలెక్టరేట్లోని భూసేకరణ తహసీల్దార్ శ్రీనివాసులును కమిషనర్ వికాస్ మర్మత్ సత్కరించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వీరి సహకారంతో ఓటరు తుది జాబితాను పారదర్శకంగా రూపొందించామని తెలిపారు. ఏఈఆర్వో దేవీకుమారి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ సమయంలో అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

నెల్లూరు (టౌన్): జాతీయ రహదారి భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహనను గురువారం కల్పించారు. ఈ సందర్భంగా ఏఎమ్వీఐ పూర్ణచంద్రరావు మాట్లాడారు. వాహనం నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను విధిగా ధరించాలని సూచించారు. ఎమ్వీఐ కార్తీక్, ఏఎమ్వీఐ స్వప్నిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ స్వరూప్, వైస్ ప్రిన్సిపల్ రమణరావు, పీఆర్వో జోజీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



నెల్లూరు(మినీబైపాస్): బీజేపీ నెల్లూరు పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వర్చువల్‌గా గురువారం ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాఘవాచార్యులుకు వాస్తురత్న బిరుదు



నెల్లూరు(బృందావనం): వెంకటాచలం మండలం పూడిపర్తి జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నగరానికి చెందిన రాఘవాచార్యులుకు వాస్తురత్న బిరుదును ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ నిర్వహించిన వాస్తు చర్చ కార్యక్రమంలో తనకు బిరుదును ప్రదానం చేశారని ఆయన చెప్పారు.

నాణ్యమైన వైద్యసేవలందించాలి



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు సిటీ: ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య పేర్కొన్నారు. నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, స్పెషలిస్ట్ వైద్యాధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పెషలిస్ట్ డాక్టర్లు అందించే వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్దేశిత తేదీల్లో ప్రజలకు డాక్టర్లు అందుబాటులో ఉండాలని సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడతలో పాల్గొన్న వారికి సూచించిన వైద్యాన్ని అందించడంతో పాటు వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో ఆపరేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల తొమ్మిదిన 19 ఏళ్లలోపు పిల్లలకు మాత్రలను ఇవ్వాలని చెప్పారు. డీపీఎంఓ రమేష్, డెమో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరాలయంలో కుంకుమార్చన



నెల్లూరు రూరల్: ధర్మప్రచార వారోత్సవాలను పురస్కరించుకొని పెద్దచెరుకూరులోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కుంకుమార్చన, లలితా సహస్రనామార్చన తదితరాలను భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించారు. కోలాట ప్రదర్శన, భక్తి గీతాలను ఆలపించారు. ఆలయ ప్రధానార్చకుడు రఘురామశర్మ, వేద పారాయణదారుడు రామకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



నెల్లూరు(బారకాసు): నగరంలోని 38వ డివిజన్ పరిధిలో గల ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టామని కార్పొరేటర్ దాసరి అమృత పేర్కొన్నారు. అరవిందనగర్ తదితర ప్రాంతాల్లో కాలువల్లో ఆయిల్‌బాల్స్‌ను వేసే పనులను గురువారం పర్యవేక్షించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి దాసరి రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండమ్మ, సెక్రటరీ ప్రవీణ్, మేస్త్రి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలకు కృషి

నెల్లూరు సిటీ: జిల్లాలోని పేదలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యసేవలను అందించేందుకు చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ 11 ఏళ్లుగా ఎంతో కృషి చేస్తోందని నిర్వాహకుడు రమేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెన్నైలోని వివిధ హాస్పిటళ్లకు చెందిన ప్రఖ్యాత వైద్యులను నెల్లూరు తీసుకొచ్చి వారి సేవలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. చెన్నైలోని మియాట్ హాస్పిటల్లో జిల్లా ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యసేవలతో పాటు వసతిని కూడా ఏర్పాటు చేశామని వివరించారు. మియాట్ హాస్పిటల్‌కు వెళ్లే రోగులకు రూ.400కే టెంపో ఏసీ వాహనాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.